ప్రజాశక్తి
మంగళవారం 25 ఏప్రిల్ 2023 5 విజయనగరం

వసతి గృహాలను కొనసాగించాలి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ డిగ్రీ విద్యా సంవత్సరం మధ్యలో ఉండగానే ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను ఈనెల 26 నుండి మూసేస్తామని చెబుతోందని,ఇది పూర్తిగా విద్యార్థులకు అన్యాయం చేయడమేనని అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ విద్యా కాలండర్ ప్రకారం , విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని యథాతధిగా కొనసాగించాలని కోరారు. దీనితో పాటు జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఐ టి ఐ కళాశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. తరగతుల నిర్వహణపై ప్రిన్సిపాల్ కనీసం శ్రద్ధ చూపించకపోవడం అన్యాయం అని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వ ఐ టి ఐ కళాశాలలో తరగతులు నిర్వహించాలని , కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వినతినిచ్చిన వారిలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి జె.రవి కుమార్, నాయకులు సోమేష్, మణికంఠ తదితరులు ఉన్నారు.

సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తాం

నీటిపారుదల శాఖామంత్రి అంబటి రాంబాబు • పెండింగ్ ప్రాజెక్టులపై సమీక్ష

సమీక్షలో మాట్లాడుతున్న నీటిపారుదల శాఖా మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-విజయనగరం

జలయజ్ఞంలో భాగంగా జిల్లాలో చేపట్టిన తోటపల్లి, తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని రాష్ట్ర నీటి పారుదల శాఖామంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వివిధ సాగునీటి ప్రాజెక్టులపై సోమవారం కలెక్టరేట్‌లో మంత్రి బొత్స సత్యనారాయణతో కలిసి మంత్రి రాంబాబు సమీక్షించారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులను కలెక్టర్ నాగలక్ష్మి, జలవనరులశాఖ ఎస్‌ఇ ఎస్.సుగుణాకరరావు ముందుగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, తారకరామ తీర్థసాగర్, తోటపల్లి ప్రాజెక్టులు జిల్లా పురోభివృద్ధికి ఎంతో కీలకమని చెప్పారు. తారకరామ ప్రాజెక్టు ద్వారా సుమారు 24,700 ఎకరాలకు సాగునీరుతోపాటు, విజయనగరం పట్టణానికి 0.48 టిఎంసిల తాగునీరు కూడా అందుతుందన్నారు. ఈ ప్రాజెక్టు నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి రోజుకు 500 ఎంఎల్‌డిల నీటిని సరఫరా చేయనున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తి కావడానికి సుమారు రూ.330 కోట్లు అవసరమని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టు పనులు పూర్తిగా పడకేశాయని చెప్పారు. తోటపల్లి ప్రాజెక్టు పూర్తి అయితే విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలో వేలాది ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని చెప్పారు. లక్షా, 31వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ఈ ప్రాజెక్టు వల్ల మూడు జిల్లాల్లో ప్రస్తుతం 83,000 ఎకరాలకు మాత్రమే నీరు అందుతోందని చెప్పారు. సుమారు రూ.267 కోట్లతో పెండింగ్ పనులను పూర్తి చేస్తే, మిగిలిన 48వేల ఎకరాలకు, ముఖ్యంగా శివారు భూములకు కూడా సాగునీరు అందుతుందని వివరించారు.

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టు రాష్ట్రంలోనే అతితక్కువ ఖర్చుతో, అత్యంత గరిష్ట ప్రయోజనాన్ని చేకూర్చే ప్రాజెక్టుగా పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, గజపతినగరం బ్రాంచ్ కెనాల్, పెద్దగెడ్డ, ఒట్టిగెడ్డ, వెంగళరాయ సాగర్ పనులను కూడా చేపట్టాల్సి ఉందని చెప్పారు.

మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ తోటపల్లి, తారకరామ తీర్థసాగర్ పనుల నిర్వహణకు నిధులను కేటాయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముందుగా సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులతో సమావేశాన్ని నిర్వహించి, సమగ్ర ప్రణాళికను రూపొందించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈప్రాజెక్టులకు సంబంధించి, ముఖ్యమంత్రి స్థాయిలో త్వరలో ఒక సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు, ఎంఎల్‌ఎలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, నీటిపారుదల శాఖ ఇఎన్‌సి నారాయణరెడ్డి, జెసి మయూర్ అశోక్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ ప్రాజెక్టుల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో స్థానిక సంస్థల బలోపేతం

- పంచాయతీరాజ్ దినోత్సవ సభలో జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- ఉత్తమ జెడ్‌పిటిసిలు, ఎంపిపిలకు సత్కారం
- సర్పంచులకు అవార్డులు



గోపాలరాయుడుపేట సర్పంచ్, కార్యదర్శికి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందిస్తున్న జెడ్‌పి ఛైర్మన్

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా స్థానిక సంస్థలు మరింత బలోపేతం అయ్యాయని జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలను స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ప్రజలకు ఉత్తమ సేవలందించిన జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలకు జడ్పీ ఛైర్మన్ చేతుల మీదుగా సత్కరించారు. వివిధ పరిపాలనా, సేవా సంబంధిత అంశాల్లో వినూత్న రీతిలో ప్రతిభ కనబరిచిన 27 గ్రామ పంచాయతీలు జిల్లా స్థాయి అవార్డులకు ఎంపికవ్వగా ఆయా గ్రామ సర్పంచులు అవార్డులు స్వీకరించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా పరిషత్ ఛైర్మన్ మాట్లాడుతూ ప్రజా సేవలో స్థానిక సంస్థల ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను వివరించారు. . సామాన్యుల అవసరాలను తెలుసుకొని, వారి అభిప్రాయాలను గౌరవించి రాష్ట్ర ముఖ్యమంత్రి సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారని అన్నారు. ప్రజా ప్రతినిధులు స్థానిక సంస్థల ప్రాముఖ్యతను తెలుసుకొని ప్రజలకు మరిన్ని ఉత్తమ సేవలందించాలని అన్నారు. ముందుగా గాంధీజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉత్తమ జెడ్‌పిటిసిలకు, ఎంపిపిలకు సత్కారం

ఉత్తమమైన రీతిలో ప్రజలకు సేవలందించిన బొబ్బిలి జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి, నెక్కల శ్రీదేవి(కొత్తవలస), గొర్లి సుజాత(కురుపాం), లెంక సన్యాసి అప్పలనాయుడు (మెంటాడ), బలగ రేవతమ్మ(పార్వతీపురం)ను జెడ్‌పి ఛైర్మన్ సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

ఎంపిపిలు పీరుబండి హైమావతి(గంట్యాడ), ఎంపిపి ఉరిటి రామారావు (గరుగుబిల్లి), బడ్నాన ప్రమీల (పాచిపెంట), నర్సపల్లి ఉమాలక్ష్మి(తెర్లాం), మామిడి అప్పలనాయుడు (విజయనగరం)ను సత్కరించారు. వీరితో పాటు జెడ్‌పి సిఇఒ అశోక్‌కుమార్, డిపిఒ శ్రీధర్‌రాజా, డిఎల్‌డిఒ నిర్మలాదేవి, పంచాయతీరాజ్ అధికారులను కూడా సన్మానించారు.

27 గ్రామ పంచాయతీలకు అవార్డుల ప్రదానం

స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాల చేరువలో భాగంగా నిర్దేశించిన తొమ్మిది అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా నుంచి పలు గ్రామ పంచాయతీలు అవార్డులకు ఎంపికయ్యాయి. ఆయా గ్రామ పంచాయతీల తరపున సర్పంచులు అవార్డులను జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతుల మీదుగా స్వీకరించారు.

ఎయిర్‌పోర్టు నిర్మాణం ప్రతిష్ఠాత్మకం

- శంకుస్థాపనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకే కాకుండా, రాష్ట్రానికే ఎంతో ప్రతిష్ఠాత్మకమని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. మే 3వ తేదీన ముఖ్యమంత్రి చేతులమీదుగా జరిగే ఎయిర్‌పోర్టు శంకుస్థాపనా కార్యక్రమానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు. విమానాశ్రయ శంకుస్థాపన, ముఖ్యమంత్రి బహిరంగ సభ నిర్వహణకు అధికార యంత్రాంగం చేయాల్సిన ఏర్పాట్లపై, వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం మంత్రి బొత్స సత్యనారాయణ సమన్వయ సమావేశం నిర్వహించారు. ముందుగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు చేస్తున్న ఏర్పాట్లను, ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులకు అప్పగించిన బాధ్యతలను వివరించారు. అనంతరం మంత్రి బొత్స మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. హెలీప్యాడ్, భూమి పూజ, పైలాన్ ఆవిష్కరణ, బహిరంగ సభ వేదికల వద్ద ప్రత్యేకాధికారులను నియమించి, వారికి బాధ్యతలు అప్పగించాలని సూచించారు. పటిష్ట బందోబస్తు నిర్వహించాలని జిల్లా ఎస్‌పిని ఆదేశించారు. సభకు వచ్చే జనాలకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన జిల్లాలో ఆరోజు ఉదయం 10.30కు ప్రారంభమై, మధ్యాహ్నం 12.30 కల్లా ముగుస్తుందని చెప్పారు. సమావేశంలో జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు, ఎంఎల్‌ఎ శంబంగి వెంకట చినప్పలనాయుడు, ఎస్‌పి దీపిక, జెసి మయూర్ అశోక్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని సోమవారం ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం పరోక్షంగా ప్రవీణ్ ప్రకాశ్ ద్వారా ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తోందన్నారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు భావిస్తున్నామని చెప్పారు. క్షేత్రస్థాయిలో విషయాలు అవగాహన చేసుకోకుండా విద్యాశాఖాధికారులను సస్పెండ్ చేయడం, షోకాజ్ నోటీసులు ఇవ్వడం పరిపాటిగా మారుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. లోపాలపై సరైన వివరణ తీసుకోకుండా చర్యలకు దిగడం దుర్మార్గమన్నారు. సమావేశంలో నాయకులు జివి రమణ, గొల్లు సూరిబాబు, ఎంవిఎస్ నారాయణ, వివిఎస్ దేవుడు, కె.బంగారు నాయుడు, ఎవి లక్ష్మి పాల్గొన్నారు.

నెల్లిమర్లలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నెల్లిమర్ల : విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తనిఖీల పేరుతో పాఠశాలలకు వెళ్ళి అకారణంగా ఉపాధ్యాయులను, విద్యాశాఖ అధికారులను సస్పెండ్ చేయడం హేయమైన చర్యని, తక్షణమే అందరి సస్పెన్షన్‌లను ఎత్తివేయాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి. రాము డిమాండ్ చేశారు. సోమవారం విద్యా శాఖా అధికారి, ఉపాధ్యాయుల సస్పెన్షన్ నిరసిస్తూ యుటిఎఫ్, ఏపిటిఎఫ్, పిఆర్‌టియు ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో ఆందోళన చేసి మానవ హారం చేపట్టారు. ఈ సందర్భంగా డి. రాము, జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాధ్ మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు చేసిన తప్పులను ఉపాధ్యాయులు, కింది స్థాయి అధికారులపై నెట్టివేసి బలిపశువులను చేయడం భావ్యం కాదన్నారు. నాసిరకం జెవికె కిట్లు సరఫరా చేసిన ఏజెన్సీలపై, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించలేని ఉన్నతాధికారుల పై చర్యలు తీసుకోవడం మాని, కావాలనే చేయని తప్పులకు ఉపాధ్యాయులను నిందించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు నాయకులు గణేష్, ఎపిటిఎఫ్ నాయకులు చందక అప్పలనాయుడు, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల రాష్ట్ర నాయకులు సూర్యనారాయణ, యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు మద్దిల సత్యనారాయణ, విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపడి యువకుడు మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- క్రికెట్ ఆడుతుండగా ఘటన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

మరికొద్ది రోజుల్లో కుమారుడు పోలీసుగా విధుల్లో చేరి.. కుటుంబాన్ని ఆదుకుంటాడని తల్లిదండ్రులు కలలు కన్నారు. ఇంతలోనే వారి కలలు అడియాశలయ్యాయి. పిడుగు రూపంలో వచ్చిన మృత్యువు వారి ఆశలను చిదిమేసింది. ఈ విషాదకర సంఘటన గాజులరేగ సమీపంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది.

మృతిచెందిన ఇజ్రాయిల్

గాజులరేగ ప్రాంతానికి చెందిన పి.ఇజ్రాయిల్(22) స్నేహితులతో కలిసి సోమవారం సాయంత్రం సమీప మైదానంలో క్రికెట్ ఆడుతున్నాడు. ఇజ్రాయిల్, సురేష్ బ్యాటింగ్ చేస్తున్నారు. ఇజ్రాయిల్‌పై పిడుగు పడటంతో అక్కడికక్కడే మరణించాడు. సురేష్‌తోపాటు సమీపంలో ఫీల్డింగ్ చేస్తున్న అఖిల్ తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరినీ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చేతికి అందొచ్చిన కొడుకు చనిపోవడంతో ఆ కుటుంబం తల్లడిల్లిపోయిన తీరును చూసి స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పోస్టుమార్టం గదికి చేరుకున్న స్నేహితులు, కుటుంబ సభ్యుల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇజ్రాయిల్ తండ్రి యాకూబ్ కూలీ పనులు చేస్తున్నారు. తల్లి మిరియమ్మ గృహిణి, సోదరి ఉన్నారు.

పోలీసు కొలువు కోసం

ఇజ్రాయిల్ స్వతహాగా మంచి క్రికెటర్. గతేడాది నుంచి బాక్సింగ్ నేర్చుకుంటున్నాడు. ఇటీవల కానిస్టేబుల్, ఎస్‌ఐ కొలువుల కోసం రాత పరీక్ష రాయగా, రెండింట్లోనూ ఉత్తీర్ణత సాధించాడు. చిత్తూరు జిల్లాలో ఈ నెల 26న నిర్వహించనున్న కానిస్టేబుల్ ఈవెంట్స్‌లో పాల్గొనేందుకు మంగళవారం సాయంత్రం బయల్దేరేందుకు అన్నీ సిద్ధం చేసుకున్నాడు. చివరిగా స్నేహితులతో కలిసి సరదాగా గడుపుతుండగా, ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. టిడిపి నగర పూర్వ అధ్యక్షులు కర్రోతు వెంకట నర్సింగరావు తదితరులు ఆసుపత్రికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్ట పోలీసులు పేర్కొన్నారు.

పలు చోట్ల వర్షం

జిల్లాలో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. గాలులు, ఉరుములతో పాటు వర్షం కురవడంతో పలు చోట్ల మామిడికాయలు నేలరాలి రైతులకు నష్టం వాటిల్లింది. గజపతినగరం, మెంటాడ మండలాల్లో భారీ వర్షం కురిసింది. వర్షంతో పాటు గాలులు వీయడంతో మామిడి కాయలు నేలరాలిపోయాయి.

మైలాన్‌లో అగ్నిప్రమాదం

ఇద్దరు ఎన్ఎంఆర్ కార్మికులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని మైలాన్ మందుల పరిశ్రమలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు ఎన్ఎంఆర్ కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో మండలంలోని కనిమేలకు చెందిన రామకృష్ణ, డెంకాడ మండలంలోని చిన్నతాడివాడకు చెందిన రమేష్ ఉన్నట్లు స్థానిక ఎస్ఐ నరేష్ తెలిపారు. ఈ ఇద్దరు కార్మికులు ఆదివారం బి షిఫ్ట్‌లో ఉండగా రాత్రి 7 గంటల సమయంలో రియాక్టర్‌లో రా మెటీరియల్ చేస్తుండగా ఫైర్ అయినట్లు ఫిర్యాదులు పేర్కొన్నారు. కార్మికులను తొందర పెట్టడం వల్లే ఫైర్ అయిందని కార్మికులు తెలిపినట్లు ఎస్ఐ తెలిపారు. బ్లాక్ ఇన్చార్జ్ నాగేశ్వరరావు ఆజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. డ్యూటీలో ఉన్నప్పుడు కార్మికులకి కావలసిన సేఫ్టీ ప్రికాషన్స్ తీసుకోలేకపోవడం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు. క్షతగాత్రులకు విజయనగరంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. రమేష్ శరీర భాగాలు బాగా కాలినట్లు తెలిస్తోంది. కార్మికులను ఎస్సై నరేష్ పరామర్శించారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బిజెపి నిర్వాకంతో ఉపాధి నిర్వీర్యం

ప్రజాశక్తి-లక్కవరపుకోట

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ఉపాధి హామీ చట్టం నిర్వీర్యం అవుతోందని వామపక్ష నాయకులు ధ్వజమెత్తారు. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని లక్కవరపుకోట, కాసాపేట, కొట్యాడతలారి, వీరభద్రపేట గ్రామాల్లో ప్రచారభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. వామపక్ష నాయకులు ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ, బిజెపి విధానాలపై ప్రజలకు వివరించి చైతన్యపరిచారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ , సిపిఐ నాయకులు మద్ది కృష్ణ , డేగల అప్పలరాజు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కందిపల్లి భీముడు, మోపాడ మధు, ఎస్.కె.స్వామి, కోన అప్పారావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారభేరిలో పాల్గొన్న వామపక్ష నాయకులు

కొత్తవలస : దేశ ప్రజలను విచ్ఛిన్నం చేసే బిజెపి అనుసరిస్తున్న మనువాదానికి వ్యతిరేకంగా, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని సిపిఎం నాయకులు గాడి అప్పారావు అన్నారు. సోమవారం అప్పన్నపాలెం, దత్తి, దన్నపేటలో ఉపాధి కూలీల దగ్గర ప్రచారం చేశారు.

మొరాయించిన బడి బస్సు

విద్యార్థికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి-గంట్యాడ

తాటిపూడి నుండి విజయనగరం వైపు వస్తున్న బడి బస్సు సోమవారం మోడల్ స్కూల్ వద్ద మోరాయించింది. అదే సమయంలో వెళ్తున్న పల్లెవెలుగు బస్సులో పిల్లలను ఎక్కించే క్రమంలో బస్ వెనుక చక్రం వద్ద ఉన్న రేకు 6వ తరగతి చదువుతున్న మజ్జి ధనుష్ కాలికి తగలడంతో గాయమైంది. వెంటనే ప్రిన్సిపాల్ ఆర్.రామకృష్ణ అతని కారులో ఆ విద్యార్థిని గంట్యాడ పిహెచ్‌సికి తీసుకెళ్లి చికిత్స అందించారు. మొరాయించిన బడిబస్సు గంటకు పాటు నిలిచిపోవడంతో ఎండ తీవ్రతకు పిల్లలు చాలా ఇబ్బందులకు గురయ్యారు. కొంతసమయం తరువాత శిక్షణా డ్రైవర్ల బస్ అదే సమయంలో అటు వైపుగా రావటంతో డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎఎస్ఎం రాజు బస్‌ను స్టార్ట్ చేశారు.

ఉపాధ్యాయురాలికి అస్వస్థత

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన ఒక్కరోజు సోషల్ ఆడిట్ శిక్షణకు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ శిక్షణకు హాజరైన పట్టణంలోని బర్మా కాలనీకి చెందిన ప్రధానోపాధ్యాయులు ఎం.పార్వతి అస్వస్థతకు గురయ్యారు. తోటి ఉపాధ్యాయులు ఆమెకు సపర్యాలు చేసి, ఏరియా ఆస్పత్రి తరలించి, చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని ఉపాధ్యాయులు తెలిపారు.

విఆర్‌ఒకు అస్వస్థత

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని కందిశ గ్రామంలో సోమవారం భూ స్టోన్ ప్లాంటేషన్ పనులు రెవెన్యూ అధికారులు చేపట్టారు. ఈ పనులు చేస్తుండగా విఆర్‌ఒ బాబా ఎండకు తట్టుకోలేక అస్వస్థతకు గురయ్యారు. తక్షణమే ఆ గ్రామ వైసిపి నాయకులు కెల్ల మన్మథరావు, తహశీల్దార్ టి. కల్యాణ చక్రవర్తి అస్వస్థకు గురైన విఆర్‌ఒకు ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం రాజాం కెఎంసి హాస్పిటల్‌కి తరలించారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితిలను తహశీల్దార్ తెలుసుకుంటున్నారు.

వినతులపై విశ్లేషణ చేయండి

అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన ప్రజా వినతులపై విశ్లేషణ చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ వినతుల పరిష్కారాన్ని అత్యంత ముఖ్యమైన అంశంగా భావించాలని అధికారులకు స్పష్టంచేశారు. నిర్ణీత వ్యవధిలోనే వినతులు పరిష్కారం జరగాలని, ఈ విషయంలో జాప్యాన్ని సహించేది లేదన్నారు. ఎక్కువగా వస్తున్న వినతులను సబ్జెక్టు వారీగా , ప్రాంతాల వారీగా విశ్లేషించుకొని ఎక్కువగా ఎందుకు వస్తున్నాయి, ఎక్కడ లోపాలున్నాయనే అంశాలను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దీనివల్ల భవిష్యత్తులో వినతుల సంఖ్య తగ్గు ముఖం పట్టవచ్చన్నారు. లీగల్ అంశాలకు సంబంధించిన వినతులు వస్తే లీగల్ అధికారులతో సమన్వయం చేసుకొని పరిష్కరించాలన్నారు. సచివాలయాలలో పరిష్కారం తీరు ఎలా జరుగుతున్నదీ దృష్టి పెట్టాలని సూచించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

స్పందనకు 165 వినతులు

స్పందనలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 165 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 117 ఉన్నాయి. పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై మిగిలిన వినతులు అందాయి. కలెక్టర్ నాగలక్ష్మి, జె.సి మయూర్ అశోక్, డిఆర్‌ఒ గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు పద్మలత, సూర్యనారాయణ, మైనారిటీ సంక్షేమ అధికారి లావణ్య, పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

మళ్లీ వైసిపి రావడం ఖాయం

టిడిపిని ప్రజలు నమ్మే స్థితిలో లేరు : డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పీపుల్స్ సర్వే 15 వేల సచివాలచయాల పరిధిలో 7లక్షల మంది గృహ సారథుల ద్వారా జరిగిందని, మళ్లీ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడం ఖాయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీపుల్స్ సర్వే ద్వారా రాష్ట్రంలో కోటి కుటుంబాలను కలవడం జరిగింది అన్నారు. విజయనగరం నియోజకవర్గంలో 91857 గడపలు ఉంటే 71700 ఇళ్లకు సర్వే చేశారన్నారు. ప్రజల ప్రోత్సాహం తమకు లభించిందన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. 175 సీట్లకు 175 గెలవాలన్న సి ఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యాన్ని నెరవేరుతుందని అన్నారు. అశోక్ గజపతిరాజు బయటకు వస్తే కొండ గుర్తు ఎన్నికలు వస్తాయని ప్రజలు అనుకుంటారని ఎద్దేవా చేశారు.

మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

దళితులకు 'ఉపాధి' కల్పించాలి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర దర్యాప్తు జరిపి నెల్లిమర్ల మండలం గుషిని గ్రామ దళితులకు ఉపాధి హామీ పనులు కల్పించాలని కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు రాకోటి ఆనంద్, జి. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గుషిని గ్రామంలో దళితులకు, వికలాంగులకు ఉపాధి హామీ పనులు కల్పించడంలో అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్ పక్షపాత వైఖరిని అవలంభిస్తున్నారని పేర్కొన్నారు. సమగ్ర దర్యాప్తు చేసి దళితులకు పని కల్పించకుండా, పనులకు దూరం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకొని గుసిని గ్రామ దళితులకు పనులు కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

వైకెపి సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో పీడీ కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యాన ఎన్ఆర్ఎల్ఎం, లోకోస్ యాప్‌పై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. జిల్లాలోగల మండల సమాఖ్య, గ్రామ సంఘం ప్రొఫైల్, ఆర్థిక లావాదేవీలు, స్వయం సహాయక సంఘాలు, సంఘ సభ్యుల ప్రొఫైల్, నెలవారీ జరిగే ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించారు. సిబ్బంది అందరూ ఈ యాప్స్‌పై అవగాహన పెంచుకొని, తప్పులు లేకుండా సమాచారాన్ని నమోదు చేయాలని పీడీ ఈ సందర్భంగా సూచించారు. భవిష్యత్తులో సంఘసభ్యుల ఆర్థిక లావాదేవీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. జిల్లాస్థాయిలో శిక్షణ తీసుకున్న సిబ్బంది మండలస్థాయిలో గ్రామసంఘ సహాయకులకు శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు.

కబ్జాల చెర నుండి చెరువులను రక్షించాలి

ప్రజాశక్తి-శృంగవరపు కోట

కిల్తంపాలెం రెవెన్యూ పరిధిలో కబ్జాలకు గురవుతున్న చెరువు గర్భాలను, కాలువలను, ప్రభుత్వ భూములను రక్షించాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ కమిటీ సభ్యులు ఈశ్వర ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'ప్రజాశక్తి'లో చెరువుల కబ్జాలపై వచ్చిన కథనానికి ఆయన స్పందించి, సోమవారం విలేకరులతో మాట్లాడారు. కిల్తంపాలెం పంచాయతీ పరిధిలో 42 చెరువులు, బంధలలో 90శాతం ఆక్రమణలలో ఉన్నాయని చెప్పారు. గతంలో ఆ ప్రాంతంలో పర్యటించినప్పుడు చెరువుల ఆయుకట్టు రైతులు ఆక్రమణపై తమ వద్ద విన్నవించుకున్నారని గుర్తుచేశారు. భూముల రీసర్వేలో భాగంగా అధికారులు సర్వేను నిష్పక్షపాతంగా నిర్వహించి, ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కల్పించాలని కోరారు. లేకుంటే చెరువుల పరిరక్షణకు కార్యాచరణ రూపొందించి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

మెరుగైన సేవల బాధ్యత కార్యదర్శులదే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మెరుగైన పౌర సేవలు అందించి ఆదర్శ సచివాలయాలుగా తీర్చిదిద్దే బాధ్యత కార్యదర్శులపై ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు అన్నారు. సచివాలయాల కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పౌర సేవలను మెరుగుపరచడం, మూమెంట్ రిజిస్టర్‌లను కచ్చితంగా నిర్వహించడం, విధులు పట్ల క్రమశిక్షణగా వ్యవహరించడం, ఖచ్చితత్వాన్ని పాటించడం వంటి అంశాలపై కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం విడనాడాలని చెప్పారు. సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ, ఎసిపి అమ్మాజీ రావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మూడేళ్లయినా శిలాఫలకాలకే పరిమితం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలో పినతాడివాడలో మూడేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన ఆర్‌బికె, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదని ఇంకా శిలాఫలకాలకే పరిమితమయ్యాయని మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ అన్నారు. అదే స్థలంలో రైతు ఉత్పత్తుల నిల్వ కేంద్రానికి కూడా శంకుస్థాపన చేశారన్నారు. సోమవారం శంకుస్థాపన ప్రాంతాలను టిడిపి ఆధ్వర్యంలో పరిశీలించారు. శంకుస్థాపనలు చేసి వదిలేయడమే తప్ప ఈ ప్రభుత్వం అభివృద్ధి చేయలేదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే శంకుస్థాపనలు చేసిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సెల్ఫీ ఛాలెంజ్ చేశారు.

పంటకోత ప్రయోగంతో మేలు

ప్రజాశక్తి- డెంకాడ

పంట కోత ప్రయోగంతో మొక్కజొన్నకు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయ విస్తరణాధికారి బి. రామకోటి తెలిపారు. మండలంలోని సింగవరంలో సోమవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో 5x6 మీటర్ల కొలతల ప్రకారం పంట కోత ప్రయోగం చేయాలన్నారు. దీంతో మొక్కజొన్నకు అధిక దిగుబడి రావడమే కాకుండా ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. జీరో టెల్ ఏజ్ విధానంతో మొక్కజొన్న వేయడం వల్ల ఎకరాకు అదనంగా 8 బస్తాలు వస్తాయన్నారు. దీంతో పాటు ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. చీడ పీడల వృత్తి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయానికి చెందిన సిఎపి గురుమూర్తి, రైతులు పాల్గొన్నారు.

దబ్బిరాజుపేటలో ఉత్సవ సందడి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని దబ్బిరాజుపేటలో గ్రామదేవత దుర్గాలమ్మ ఉత్సవాల నేపథ్యంలో సందడి నెలకొంది. సోమవారం తొలేళ్ల సంబరం, బండిప్రభ ప్రతిష్ట, కల్యాణం నిర్వహించారు. సుమారు 22 ఏళ్ల తరువాత గ్రామదేవత ఉత్సవాలు నిర్వహిస్తుండటంతో భారీగా జనాలు తరలివచ్చారు. సర్పంచ్ దండుపాటి ముత్యాలమ్మ, ఎంపిటిసి చామంతులు లక్ష్మి, వై.కె.నాయుడు, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు.

విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న జోనల్ మేనేజర్ వెంకటరమణరావు

ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

ప్రజాశక్తి- విజయనగరం

జామి మండలంలోని విజినిగిరి రామ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సోమవారం ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ యాంకర్ మాసం వేడుకలను పురష్కరించుకుని 6,7,8,9 తరగతుల విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహించారు. ఇందులో గెలిపొందిన విజేతలకు ఇండియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ సిహెచ్ వెంకటరమణరావు, పిఒ వెంకటరమణ, ఎజిఎం, ఆర్‌విఆర్ ప్రాజెక్టు ఛైర్మన్ ఆర్. వెంకటేశ్వరరావు చేతులు మీదుగా బహుమతులను అందించారు. క్విజ్ విజేతలను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

27న తహాశీల్దార్ కార్యాలయ ముట్టడి

వేపాడ : గిరిజనుల సాగుభూములకు పట్టాలివ్వాలని ఈ నెల 27న తహాశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో కొండగంగుపూడి పంచాయతీ పరిధిలోని తొమ్మిది గ్రామాల గిరిజనులు ఆందోళన చేసిన నేపథ్యంలో సర్వే చేసి మూడు నెలల్లో పట్టాలిస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. సుమారు 10 నెలలు గడిచినా పట్టాలివ్వలేదని చెప్పారు.

గంగుబూడిలో ఆర్‌ఒ ప్లాంట్, లైబ్రరీ ప్రారంభం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

సత్యసాయి ట్రస్ట్ ఫర్ యూనివర్సల్ వెల్ఫేర్ ఆర్థిక సహాయంతో గంగుబూడి పంచాయతీలో నూతనంగా నిర్మించిన సాయి దివ్య జలామృతం, దివ్య గ్రంథాలయాలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎంపిపి గేదెల శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. వీటి నిర్మాణానికి బంగారు అప్పలరాజు స్థలాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో పుట్టపర్తి సత్యసాయిబాబా స్వరూప కుమార్ స్వామీజీ, అమరావతి ప్రిన్సిపల్ ఆర్కిటెక్స్ డిజైనర్ ఎన్‌వి సుబ్బారావు, ఎంఇఒ సిహెచ్ కూర్మారావు పాల్గొన్నారు.

బోరు బావి ప్రారంభం

మెంటాడ : తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో పంచాయతీరాజ్ నిధులతో నిర్మించిన బోరుబావిని సోమవారం సర్పంచ్ రేగిడి రాంబాబు ప్రారంభించారు. మండల కాంప్లెక్స్‌కు వచ్చిన ప్రజలు దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా బోరు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ముగడ లింగేశ్వర రావు, పంచాయతీ కార్యదర్శి రామనాథ్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ

శృంగవరపుకోట : పట్టణంలోని శాఖా గ్రంథాలయానిక కీర్తిశేషులు నారికేనబిల్లి చలమయ్య శెట్టి కుమారుడు సీతారామయ్య రూ.6 వేలు విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను సోమవారం అందించారు. వారికి శాఖా గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్, పాఠకులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి కుటుంబానికీ వంద రోజుల పని

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం వంద రోజులు పని కల్పిస్తుందని దీన్ని వేతన దారులు వినియోగించుకోవాలని ఎపి టూరిజం రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు అన్నారు. సీతారామునిపేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం రెండు పూటలా పనిచేస్తే కూలి గిట్టుబాటవుతోందన్నారు. ప్రతి ఒక్క లబ్ధిదారుడు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రౌతు జగన్నాథం, ఉపాధి మెట్లు, వేతనదారులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

గ్రీన్‌అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి-రామభద్రపురం

కనీస వేతనాలు ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యాన పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఎంపిపి లక్ష్మణరావుకు వినతి పత్రం అందించారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్ల సంఘం జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, సిఐటియు మండల కార్యదర్శి బలసా శ్రీను మాట్లాడుతూ నెలనెలా వేతనాలు రాకున్నా, పస్తులతో, అర్ధాకలితో కార్మికులు పనులు చేస్తున్నారని ఆవేదన చెందారు. కొన్ని నెలలుగా వేతనాలు లేవని, ప్రతి నెలా 5లోగా వేతనాలు చెల్లించే ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.18 వేలిచ్చి, రక్షణ పరికరాలు, ప్రమాద బీమా, ఏకరూప దుస్తులు, గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలన్నారు. రాజకీయ వేదింపులు ఆపి, అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల గ్రీన్ అంబాసిడర్లు, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

వేపాడ.. ఉత్తమ సర్పంచులను సత్కరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - గుర్ల

పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న పంచాయతీ కార్యదర్శులను, సర్పంచ్, ఎంపిటిసిలను సన్మానించి ధృవీకరణ పత్రాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పొట్నూరు ప్రమీల, జెడ్‌పిటిసి శీర అప్పల నాయుడు, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపి తోట తిరుపతి రావు, ఎంపిడిఒ బి కల్యాణి, వివిధ శాఖల అదికారులు పాల్గొన్నారు.

డెంకాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలువుర సర్పంచ్‌లను ఘనంగా సత్కరించారు. మండలంలో పలు సచివాలయాల్లో కూడా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పెన్నింటి తమ్మి నాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూపరాణి, ఇఒపిఆర్‌డి ఎన్ అప్పలనాయుడు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలోని పూసపాటిరేగ, పూసపాటి పాలెం, కుమిలి, లంకలపల్లిపాలెం పంచాయితీని ఉత్తమ పంచాయితీలుగా ఎంపికైనట్లు ఎంపిడిఒ రామారావు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలంయలో ఆ గ్రామ సర్పంచులు టి.సీతారాం, రౌతు స్వామినాయుడు, మామిడి అప్పయ్యమ్మ, రౌతు వెంకటలక్ష్మిని ఎంపిపి మహంతి కళ్యాణితో పాటు మండలస్థాయి అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనువాసరావు, నాయకులు మహంతి జనార్ధనరావు, జెఇ శ్రీనువాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ గ్రేస్మా, ఇఒపిఆర్డి శ్రీనువాసరావు, కార్యదర్శిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో పంచాయితీరాజ్ వ్యవస్థ దినోత్సవం సందర్భంగా ఉత్తమ పంచాయతిగా ఎంపికైన సర్పంచులను ఎంపిపి అంబళ్ళ సుధారాణి ఘనంగా సత్కరించారు. మండలంలో చంద్రంపేట, గరికిపేట, కొండగుంపాం, మొయిద, పూతికపేట, కొండవెలగాడ, చినబూరాడపేట, పెదబూరాడపేట, కొత్తపేట, దన్నానపేట పంచాయతీలను ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక చేసి సర్పంచులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ల శ్రీరాములు నాయుడు, ఇఒపిఆర్‌డి హెచ్. భానోజీరావు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : గ్రామీణ ప్రజల దైనందిన అవసరాలను మేలైన పద్ధతిలో తీర్చడానికి పంచాయతీలు దోహదపడతాయని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఉత్తమ సేవలందించిన సర్పంచులు, ఎంపిటిసిలను సన్మానించి, ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపిలు ఇందుకూరి సుధారాజు, పి.వెంకట రమణ, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, ఎంపిడిఒ శేషుబాబు, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లక్కవరపుకోట : మండలంలోని 17 మంది కార్యదర్శులకు ఉత్తమ పంచాయతీ పురస్కారాలను సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి గేదెల శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జ్ఞానేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

కొత్తవలస : ఎంపిడిఒ కార్యాలయంలో ఉత్తమ సేవలు అందించిన సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిని ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, ఎంపిడిఒ వై.పద్మజ సన్మానించారు. అనంతరం ఎంపిపిని అధికారులు సత్కరించారు.

తెర్లాం : ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలు అందించిన సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో వైస్ఎంపిపి సత్యనారాయణ, నాయకులు రామారావు పాల్గొన్నారు

బొబ్బిలిరూరల్ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉత్తమ సేవలందించిన సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిని ఎంపిపి శంబంగి లక్ష్మి, ఎంపిడిఒ ఎ.భాస్కరరావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాల్ నాయుడు, ఎంఇఒ లక్ష్మణరావు పాల్గొన్నారు.

శృంగవరపుకోట.. ఉత్తమ సర్పంచులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

వేపాడ : మండలంలోని వావిలపాడు గ్రామంలో పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలను సర్పంచ్ బీల రాజేశ్వరి ఆధ్వర్యాన నిర్వహించారు. సచివాలయ కన్వీనర్ బీల సతీష్‌తో కలిసి సర్పంచ్ గ్రీన్ అంబాసిడర్లను సన్మానించి, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.

సిఎం సభను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ప్రజాశక్తి - భోగాపురం

మే 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేయనున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. సోమవారం ఉప్పాడపేటలో మీడియాతో ఆయన మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయం కేవలం తమ నియోజకవర్గానికే కాకుండా, ఉత్తరాంధ్ర జిల్లాలకే ఎంతో ప్రతిష్టాత్మకమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం భూసేకరణ చేయకుండానే, ఎన్నికల ముందు హడివిడిగా ఉత్తుత్తి శంకుస్థాపన చేసిందని విమర్శించారు. నిర్వాసితులు, నాయకులపై 18 కేసులు నమోదు చేసి, వారిని ఎన్నోరకాలుగా ఇబ్బంది పెట్టిందన్నారు. దాదాపు నాలుగేళ్లపాటు తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసి, భూసేకరణను పూర్తి చేసి, నిర్వాసితులకు న్యాయం చేసి, వారికి పూర్తిగా పునరావాసం కల్పించిన తరువాతే, శంకుస్థాపన చేస్తున్నామని చెప్పారు. అంతకుముందు జగనన్నే మా భవిష్యత్తు అనే పీపుల్స్ సర్వే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇందులో భాగంగా సవరవిల్లి సంతలో పర్యటించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైసిపి నెల్లిమర్ల పరిశీలకులు అందవరపు సూరిబాబు, మండల పార్టీ కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్, మత్స్య కార్పొరేషన్ డైరెక్టర్లు ఉప్పాడ శివారెడ్డి, మైలిపల్లి నరసింహులు, వైస్ ఎంపిపి రావాడబాబు తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పోలిపల్లి ఉన్నత పాఠశాలలో కళావేదిక ప్రారంభం

మండలంలోని పోలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిన్నింటి కుటుంబీకులు రూ.3 లక్షలతో పాఠశాల విద్యార్థుల కోసం కళావేదిక నిర్మించారు. దీన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కోసం ఇంత మంచి కార్యక్రమం చేసిన పిన్నింటి కుటుంబీకులను అందరూ అభినందించాలన్నారు. ఈ పాఠశాలను కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, దేవస్థానం బోర్డు మెంబర్ బంగారుతల్లి, పిన్నింటి చిన్న, కర్రోతు బంగారు రాజు, హెచ్ఎం, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ అక్రమాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతి ప్రభుత్వ భూముల అక్రమాలపై కలెక్టర్ గ్రీవెన్స్‌లో సోమవారం స్థానిక ఇందిరా కాలనీకి చెందిన పతివాడ రమేష్ ఫిర్యాదు చేశారు. నగర పంచాయతిలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, గత తహశీల్దార్లు జారీ చేసిన దొంగ పట్టాలు అమ్ముకొని అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నాడు. ముఖ్యంగా శ్రీరాంనగర్ కాలనీ సర్వే నెంబర్ 88, 17, 89, చంద్రబాబు నాయుడు కాలనీ సర్వే నెంబర్ 60, తెలకలి వీధి సర్వే నెంబర్ 52, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు సర్వే నెంబర్ 49, పాత తహశీల్దారు కార్యాలయం రోడ్డు సర్వే నెంబర్ 45లో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పేదలు గుడిసెలు నిర్మించుకుంటే దౌర్జన్యాలకు పాల్పడి డబ్బులు అడిగి ఇవ్వకపోతే టౌన్ ప్లానింగ్ అధికారులతో వచ్చి తొలగింపు చర్యలు చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎవరైనా సొంత స్థలంలో కొత్తగా ఇళ్లు నిర్మించుకుంటే రూ. 50వేలు వరకు నగర పంచాయతీ సిబ్బంది వసూళ్లు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. కాగా రెవెన్యూ సిబ్బంది, నగర పంచాయతి సిబ్బంది కలసి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వీరిపై జిల్లా అధికార్లు దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను రమేష్ కోరారు.

పేదల భూమిని థర్మల్ ప్లాంట్‌కు ఇవ్వొద్దు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పేదలు సాగు చేసుకుంటున్న డి-పట్టా భూములను థర్మల్ ప్లాంట్‌కు కేటాయిస్తూ సిసిఎల్ఎ తీర్మానం చేయడానికి వ్యతిరేకిస్తున్నామని రైతు కూలీ సంఘం కార్యదర్శి డి.వర్మ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలు సాగు చేస్తున్న డి -పట్టా భూములను కోటిపాం థర్మల్ పవర్ ప్లాంట్‌కు ఇచ్చేందుకు సిసిఎల్ఎ తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. గతంలో 642 ఎకరాలు, ఇప్పుడు మరో 32 ఎకరాల భూమిని థర్మల్ పవర్ ప్లాంట్‌కు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్న రెవెన్యూ యంత్రాంగం చర్యలను ఆపాలని, భూమికి భూమి కేటాయించి పేదలకు జీవించే భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందిస్తున్న ఎజిఎం, కోఆర్డినేటర్

'నారాయణ'లో స్నాతకోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలో నారాయణాస్ కేంబ్రిడ్జి పాఠశాల ఇ-కిడ్స్ విభాగంలో గ్రాడ్యుయేషన్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇ-కిడ్స్ కో-ఆర్డినేటర్ గ్రేషి, పాఠశాల ఎజిఎం శ్రీనివాసరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కో-ఆర్డినేటర్ గ్రేషి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ఆసక్తి చూపాలన్నారు. ఎజిఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలతో విద్యనందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చిన్నారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో పాఠశాల రీజనల్ ఇన్‌ఛార్జి రవికుమార్, ఇ-కిడ్స్ వైస్ ప్రిన్సిపల్ రోజా పాల్గొన్నారు.

సాగు పట్టాలు ఇవ్వాలని వినతి

పాచిపెంట : మండలంలోని కొటికిపెంట పంచాయితీ కొత్తపేట, వడిసెలమడ గిరిజన రైతులు గత 60ఏళ్లుగా సాగు చేస్తున్న భూములకు సాగు పట్టాలు మంజూరు చేయాలని సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల రైతులు సోమవారం స్థానిక తహశీల్దార్ బి.రాజశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అప్పలనాయుడు మాట్లాడుతూ గత 60 ఏళ్లుగా సాగు చేస్తున్న భూములకు సాగు పట్టాలు అందజేయాలని కోరారు. సాగు పట్టాల్లేకపోవడంతో రైతు భరోసా, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందడంలేదని, వీరి సమస్యపై దృష్టి సారించి సాగు పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-కొత్తవలస

కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. కొత్తవలసలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులతో కలిసి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా కోటి గృహాల సందర్శనను పూర్తిచేసినట్లు కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ రఘురాజుతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలు ఎన్ని అవాకులు, చవాకులు పేలినా ముఖ్యమంత్రి జగన్ మాత్రం పరిపాలనలో ప్రజాసంక్షేమం, శ్రేయస్సు మార్గాలనే ఎంచుకుంటూ ముందడుగు వేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందన్నారు. వర్తమాన రాజకీయాల్లో ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీతగా, బైబిల్‌గా, ఖురాన్‌గా భావించి తూచా తప్పకుండా అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేలు ఎన్నికలకు ముందే ప్రజల మధ్యకు వెళ్లే చరిత్ర ఇప్పటివరకు లేదన్నారు. ప్రజాక్షేత్రంలో గెలిచిన నాయకుడు ప్రజల మధ్యలోనే ఉండాలనేది సిఎం సంకల్పమన్నారు. సమావేశంలో కొప్పల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడుబాబు, డిసిసిబి ఛైర్మన్ వి.వి.చినరామునాయుడు, ఎఎంసి ఛైర్‌పర్సన్ మూకల కస్తూరి, ఎంపిపిలు నీలంశెట్టి గోపమ్మ, జి.శ్రీనివాసరావు, దొగ్గ సత్యవంతుడు, జెడ్‌పిటిసిలు నెక్కల శ్రీదేవి, ఎస్.అప్పారావు, కొత్తవలస పిఎసిఎస్ ఛైర్మన్ గొరపల్లి రాము పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, వైసిపి నాయకులు

లక్కవరపుకోట కార్యదర్శిపై చర్యలకు తీర్మానం

ప్రజాశక్తి-లక్కవరపుకోట

లక్కవరపుకోట సచివాలయ కార్యదర్శి కెవి రమణపై చర్యలు తీసుకునేందుకు ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, ఎంపిడిఒ జ్ఞానేశ్వరరావు సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో నిర్ణయించారు. ఇఒ రమణ విధుల పట్ల బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నారని, ప్రజల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారని, సుమారు 8 పంచాయతీ సమావేశాలకు హాజరు కాలేదని, పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వర్తించడం లేదనే కారణాలే కాకుండా, ఈ నెల 19న జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ప్రతి పనికీ లంచం తీసుకుంటున్నారని మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ ఖాసీం, లచ్చింపేట ఎంపిటిసి భూమిరెడ్డి స్వామినాయుడు అధికారుల దృష్టికి తీసుకురావడంతో చర్యలకు తీర్మానించినట్లు ఎంపిడిఒ తెలిపారు. తీర్మానం ఆధారంగా ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు చెప్పారు.

చిన్న మొత్తాల పొదుపు ఏజెంట్ల వెతలను తీర్చాలి

ప్రజాశక్తి-విజయనగరం

పోస్టాఫీసుల్లో చిన్న మొత్తాల పొదుపు ద్వారా నెల నెలా ఆర్‌డిలు కట్టే ఏజెంట్‌లకు కష్టకాలం వచ్చిందని, నెల రోజులుగా ఏజెంట్లు సేకరించిన ఆర్‌డి మొత్తాలను పోస్టాఫీసుల్లో తీసుకోవడం లేదని పలువురు ఏజెంట్లు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఏజెంట్లకు ఐడి కార్డులుగా ఇచ్చే అసలాస్ కార్డ్ లు అటు స్మాల్ సేవింగ్స్ డిపార్ట్మెంట్ గాని ఇటు పోస్ట్ ఆఫీస్‌లు గాని జారీ చేయకపోవడం వలన ఆర్‌డిలు నిలిచిపోయాయని తెలిపారు. చెల్లిస్తున్న మొత్తాలు ఆర్‌డి ఖాతాల్లో చేరకపోవడంతో ఖాతాదారులు, ఏజెంట్‌లు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పోస్టల్ ఉన్నతాధికారులకు కూడా వినతులు ఇవ్వడంతో త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆర్‌డి ఏజెంట్ల అసోసియేషన్ నాయకులు ఎస్.కామేశ్వర రావు, వెంకటరావు తెలిపారు.

పిఎసిఎస్ ఛైర్మన్‌గా మురళీధరరావు

ప్రజాశక్తి - గుర్ల

మండలంలో గూడెం పిఎసిఎస్ ఛైర్మన్‌గా రెడ్డి మురళీధర రావు సోమవారం భాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. సొసైటీ సభ్యులు అవసరాలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. రైతులకు కావలిసిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకంతో భాధ్యతలు అప్పగించిన పెద్దలు మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి శీర అప్పల నాయుడు, వైసిపి పలాస నియోజకవర్గ పరిశీలకులు కెవి సూర్యనారాయణరాజు, మండల నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు, డిఎల్‌డిఎ ఛైర్మన్ బెల్లాన బంగారు నాయుడు, వైస్ ఎంపిపి తిరుపతిరావు, గూడెం సర్పంచ్ వై లక్ష్మణరావు, రెడ్డి అప్పల నరసయ్య, అట్టడా అప్పల రాజు, పిఎసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

జిల్లాలో ఉత్తమ పంచాయతీలుగా గోపాల్‌రాయుడుపేట, ఎం.బూర్జివలస ఎంపికయ్యాయి. మౌలిక సదుపాయాలు, లింగ సమానత్వంలో గ్రామాభివృద్ధి సాధించినందుకు గాను గోపాల్‌రాయుడుపేట సర్పంచ్ రెడ్డి హిమభిందు, కార్యదర్శి ఉమామహేశ్వరి, ఎం.బూర్జివలస సర్పంచ్ ఎస్.ఈశ్వరరావు, కార్యదర్శి కృష్ణవేణిలకు జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, సిఇఒ అశోక్ కుమార్ అవార్డులిచ్చి సన్మానించారు.

నేరాలు ఘోరాలు

దొంగతనం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దాసరివానిపాలెంలో చోరీ

కొత్తవలస : మండలంలోని వీరభద్రపురం పంచాయతీ దాసరివానిపాలెం గ్రామంలో ఆదిమూలపు సుదీర్ ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. అందరూ గాఢ నిద్రలో ఉండే సమయంలో దొంగలు గునపాం సహాయంతో కిటికీ పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. కిటికీ పగలగొట్టడానికి ఉపయోగించిన గునపాం పక్కనున్న తుప్పలో పారవేసి పరారయ్యారు. సుమారు రూ.20 వేలు నగదు, ఏడు తులాల బంగారం అపహరించినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు వివరించారు. సిఐ ఎస్.బాలసూర్యారావు సోమవారం సంఘటనా స్థలం చేరుకున్నారు. విజయనగరం నుంచి క్లూస్ టీంను రప్పించి అణువణువు క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని సిఐ తెలిపారు.

గనివాడలో విషాదఛాయలు

లక్కవరపుకోట : మండలంలోని గనివాడ గ్రామపంచాయతీలో విషాదఛాయలు అలుముకున్నాయి. గనివాడకు చెందిన బాదిరెడ్డి సాయికుమార్ (28) ఇంజినీరింగ్ చదువుకున్నాడు. తిరుపతి వెళుతున్నానని చెప్పి తన స్నేహితులతో ఈనెల 21 న గోవాకు వెళ్లారు. 22 న స్విమ్మింగ్ చేసేందుకు నదిలో దిగి ఈతరానందున నీటిలో మునిగి మృతి చెందాడు. సాయికుమార్ మృతదేహానికి గోవా ప్రభుత్వం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్ప చెప్పడంతో మృతదేహాన్ని స్వగ్రహమైన గనివాడకు తీసుకువచ్చారు. మృతుని తండ్రి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కావడంతో ఎంఇఒ సిహెచ్ కూర్మారావు, యుటిఎఫ్ నాయకులు సన్యాసినాయుడు తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. సోమవారం సాయంత్రం సాయికుమార్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.